క్లుప్తంగా

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విశాఖపట్నంకు చెందిన కూచిపూడి నాగచందన బృందం సోమవారం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీనిధి, సంహిత, గీతక, శ్రేష్ఠ, మౌల్య, హన్సిత, సాత్విక, యష్మిత, వైనవి, అనన్య, జసీనా, పల్లవి తదితరులు పలుకీర్తనలకు చక్కటి హావ భావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శన అనంతరం శిష్యబృందాన్ని ఆలయ డీఈవో రత్నరాజు అభినందించి దేవస్థానం తరఫున ప్రసాదాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం అమ్మవారి దర్శనం కల్పించారు.

వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా ఉపాధ్యక్షుడిగా కొల్లూరి ఎన్నిక



మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరానికి చెందిన ప్రముఖ సంఘ సేవకుడు, ఎక్స్‌రే సాహిత్య సేవాసంస్థ అధ్యక్షుడు కొల్లూరి వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా వైస్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏలూరులో జరిగిన అంతర్జాతీయ వాకర్స్ సమావేశంలో కొల్లూరిని ఏరియా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పుష్కర కాలంగా నడక ఉద్యమానికి సేవలు అందించిన కొల్లూరి ఉత్తమ వాకర్స్ అధ్యక్షుడు, రీజినల్ కౌన్సిలర్, జిల్లా గవర్నర్‌గా ప్రశంసలు అందుకున్నారు. అలాగే ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఆదుకునేందుకు మహాత్మాగాంధీ ఫెలోషిప్ ద్వారా రూ.20 లక్షల నిధిని సమకూర్చారు. సాహితీవేత్తగా, లయన్స్ క్లబ్‌లో వివిధ హోదాలలో పలు సేవలు అందించారు. వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన ఆయనను ఎక్స్ రే, లయన్స్ క్లబ్, డాక్టర్ బ్రహ్మదేశం సొసైటీ సభ్యులు సోమవారం అభినందించారు.

ఈవోకు ఘనసత్కారం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వీరాంజనేయ స్వామివారి దేవస్థాన ఈవోగా సోమవారం ఉద్యోగ విరమణచేసిన రావూరి వెంకటేశ్వరరావును ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు. శ్రీదుర్గా గాయత్రి అర్చక, యాజ్ఞిక పురోహిత సేవా సంఘం అధ్యక్షులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఆలయ అభివృద్ధితో పాటు స్వామివారి దర్శనానికి విచ్చేసే భక్తులకు అవసరమైన అనేక సదుపాయాలు, సౌకర్యాలను ఈవో వెంకటేశ్వరరావు కల్పించారని పలువురు వక్తలు కొనియాడారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గం గట్టు వెనుక ప్రాంతంలోని విద్యాధరపురం 38వ డివిజన్ 119 సచివాలయం పరిధిలోగల పున్నమిఘాట్ సమీపంలోని అజీమ్ వీధిలో జరుగుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రతి సచివాలయం పరిధిలో అభివృద్ధి పనుల నిమిత్తం నిధులు కేటాయించారని గుర్తు చేశారు. అందులో భాగంగానే మంజూరైన రూ.23లక్షల వ్యయంతో ఇక్కడ సీసీ రోడ్డు నిర్మాణ పనులు సాగుతున్నాయని తెలిపారు.

సంగీత విదుషీమణి పద్మావతికి సత్కారం

విజయవాడకల్చరల్: గాత్ర సంగీత విద్వాంసురాలు చింతామణి సంగీత విద్యాలయం వ్యవస్థాపకురాలు సీఎస్ పద్మావతికి ఆత్మీయ సత్కార కార్యక్రమం సోమవారం నిర్వహించారు. తెలుగు కళావాహిని, ఎంఎస్ బాలసుబ్రహ్మణ్యం స్మారక సమితి, కేవీ బ్రహ్మానందం కళా సంస్థ ఆధ్వర్యంలో కొత్తా పూర్ణానందం కళా వేదికపై జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సంగీత విద్వాంసుడు బ్రహ్మానందరావు పాల్గొని ప్రసంగించారు.

కళతప్పిన కేఎల్‌రావు పార్క్

- నాటి వైభవం తిరిగి వచ్చేనా?
- బోటు షికారు నిలిపివేతే కారణం
- నెలల తరబడి మరమ్మతులతో తగ్గిన సందర్శకుల సంఖ్య
- బోటు షికారును పునరుద్ధరించాలని నగరవాసుల డిమాండ్



కేఎల్‌రావు పార్కు ప్రవేశ ద్వారం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కేఎల్‌రావు పార్కు...విజయవాడ నగరవాసులకు పరిచయం అక్కర్లేని పార్కు... ముఖ్యంగా పశ్చిమ నియోజకవర్గ చిన్నారులు, ప్రజలకు ఆహ్లాదం పంచే పార్కు.. ఈ పార్కు బోటింగ్‌కు పెట్టింది పేరు.. నగరంలో ఎన్నో రైవస్ కాల్వలు, పార్కులు ఉన్నా.. ఏపార్కుకు లేని ప్రత్యేకత కేఎల్‌రావు పార్కుకు ఉంది. పార్కు ప్రారంభం నుంచే ఉన్న బోటింగ్ సదుపాయం రెండేళ్లుగా నిలిచిపోవడంతో పార్కును సందర్శించేవారి సంఖ్య తగ్గిపోయి పార్కు కళతప్పిందనే చెప్పవచ్చు.

రూ.2కోట్లతో అభివృద్ధి పనులు..

పార్కుకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న బోటింగ్ ఇప్పుడు మచ్చుకైనా కనిపించడం లేదు. పార్కు అభివృద్ధికి 46వ డివిజన్ కార్పొరేటర్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఎంతగానో కృషి చేస్తున్నారు. ఇప్పటికే పార్కు అభివృద్ధి కోసం రూ. 2కోట్ల మేర నిధులు వెచ్చించారు. పార్కులో వాకింగ్ ట్రాక్, ఇండోర్ స్టేడియం, చిన్నారులు ఆడుకునేందుకు ఆట వస్తువులను ఏర్పాటు చేయించారు. అయితే బోటింగ్ కెనాల్‌లో బోట్లను నడిపేందుకు మాత్రం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

నెలకు రూ.1.50లక్షల ఆదాయానికి గండి..

కేఎల్‌రావు పార్కులో బోటింగ్ సదుపాయం కొనసాగిన సమయంలో నిత్యం వందలాది మంది పార్కును సందర్శించేవారు. రోజూ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు బోటింగ్ కెనాల్‌లో బోట్లను నడిపేవారు. సందర్శకుల కోసం ఐదు బోట్లు అందుబాటులో ఉండేవి. పార్కు ప్రవేశ రుసుం కాకుండా అదనంగా బోట్లలోకి ఎక్కేందుకు టికెట్లు కొనుగోలు చేసేవారు. ఈ బోటు టికెట్ల విక్రయాల ద్వారా నిత్యం రూ.4వేల పైబడి ఆదాయం సమకూరేది. ఇక శనివారం, ఆదివారం, పండుగ రోజుల్లో ఆదాయం రూ. 6వేల నుంచి రూ. 8 వేలకు పైగా వచ్చేంది. అయితే పార్కులో బోటింగ్ సదుపాయం నిలిచిపోయినప్పటి నుంచి సందర్శకుల రాక అంతంత మాత్రంగానే ఉంది. సందర్శకుల సంఖ్య తగ్గడంతో ఆకతాయిలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారికి పార్కు అడ్డాగా మారుతుంది. గతంలో పోలీసులు సైతం పార్కులో ఆకతాయిలకు కౌన్సెలింగ్ ఇచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి.



విరిగిపోయిన నిరుపయోగంగా మారిన వస్తువులు

బోటు షికారు పునరుద్ధరణ ఎప్పుడో!

ఇక పెళ్లిళ్లు, పంక్షన్లు, ఇతర శుభకారాలు చేసుకునేవారు ఫోటోసూట్ చేసుకునేందుకు కేఎల్‌రావు పార్కు అనువైన ప్రాంతంగా భావించి ఎక్కడెక్కడి నుంచే ఈ పార్కుకు వస్తుంటారు. సోషల్ మీడియా, యూట్యూబర్లు, వీడియో ఎడిటర్ల రాక బాగానే ఉన్నా... పార్కులో కనీస సదుపాయాలు లేకపోవడంతో వారు వెనుదిరుగుతున్నారు. కొన్నిచోట్ల ఆటవస్తువలు సైతం విరిగిపోయి ఉన్నాయి. దీంతో పార్కు నిర్వహణపై సందర్శకులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి కేఎల్‌రావు పార్కులో బోటింగ్ సదుపాయాన్ని పునరుద్ధరించడంతోపాటు మౌలికవసతులు మెరుగుపరచాలని నగరవాసులు కోరుతున్నారు.



నిరుపయోగంగా మారిన బోటింగ్ కెనాల్

కళాకారుల ప్రతిభను ప్రోత్సహించాలి



శ్రీనివాసరావుకు పురస్కారం అందజేస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, నిర్వాహకులు

విజయవాడకల్చరల్: కళాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. సుఖమంచి పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో బందరురోడ్డులోని బాలోత్సవ భవన్‌లో సోమవారం సుఖమంచి పబ్లికేషన్స్ ప్రతిభా పురస్కారాల సభ, నాట్యప్రదర్శనలు, సుఖమంచి హాస్యపుజల్లులు 1 గ్రంథావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. కళాకారులు సాంస్కృతిక వారధులన్నారు. రంగస్థలానికే అంకితమైన సుఖమంచి అనేక మంది నటులను పరిచయం చేశారని తెలిపారు. నిర్వాహకుడు సుఖమంచి సంస్థ లక్ష్యాలను వివరించారు. వివిధ రంగాలకు చెందిన ఎన్ఎస్ మూర్తిరాజుకు దాసరి నారాయణరావు, బీసీ పద్మదాసుకు బాపు, యనాపు ఉమామహేశ్వరరావుకు బళ్లారి రాఘవ, కొప్పుల ఆనంద్‌కు కొంగర జగ్గయ్య, కొల్లి నాగేశ్వరరావు, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కేవీఎల్ఎన్ శర్మకు వీరేశలింగం, మురుపిళ్ళ హనుమంతరావుకు ధన్వంతరి, రాయన శ్రీనివాసరావుకు నటరాజ రామకృష్ణ, దోకిపర్తి వరప్రసాద్‌కు గురజాడ పురస్కారాలను అందజేశారు. నటరాజా నృత్యాలయం చిన్నారులు ఆంధ్రనాట్యం అంశంగా నృత్యాలను ప్రదర్శించారు.

హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే చర్యలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ద్విచక్రవాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే చర్యలు తప్పవని వెస్ట్‌జోన్ డీసీపీ జి.రామకృష్ణ హెచ్చరించారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని గద్దబొమ్మ సెంటర్, కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్ తదితర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనచోదకులకు జరిమానాలను విధించి కౌన్సిలింగ్ చేశారు. డీసీపీ రామకృష్ణ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదసమయంలో ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. వేగం కన్నా భద్రత ముఖ్యమన్నారు. నిబంధనల ప్రకారం ప్రతిఒక్కరూ వాహనాలను నడపాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ దుర్గారావు, సీఐ గురుప్రకాష్ పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడకు సజ్జనరావు వన్నె తెచ్చారు



సజ్జనరావు దంపతులను సన్మానిస్తున్న శ్రీకాంత్ తదితరులు

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్రంలో కబడ్డీ క్రీడకు యంగ్రపాటి సజ్జనరావు వన్నె తెచ్చారని పలువురు సీనియర్ కబడ్డీ క్రీడాకారులు పేర్కొన్నారు. విజయవాడకు చెందిన సజ్జనరావు జాతీయ, అంతర్జాతీయ కబడ్డీ పోటీల్లో రాణించి తద్వారా రైల్వే శాఖలో ఉద్యోగం పొంది, 34 ఏళ్లు రైల్వే శాఖ ద్వారా ప్రజలకు సేవలందించారని కొనియాడారు. నేడు ఉద్యోగ విరమణ చేయనున్న సజ్జనరావును విజయవాడకు చెందిన సీనియర్ కబడ్డీ క్రీడాకారులు రైల్వే స్టేడియంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ కబడ్డీ జట్టుకు ప్రాతినిధ్యం వహించి ఎన్నో జాతీయ పతకాలను సాధించారని గుర్తుచేశారు. రైల్వే శాఖలో చేరిన తరువాత దక్షిణ భారత రైల్వే శాఖ కబడ్డీ జట్టుకు ప్రాతినిధ్యం వహించారని, ఆయన ఆధ్వర్యంలోని జట్టు ఎన్నో పతకాలను దక్షిణ భారత రైల్వే శాఖకు అందించిందన్నారు. పంచాయతీరాజ్ రిటైర్డ్ ఎస్ఈ ఎన్.వి.రమణరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కె.పి.రావు, ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ పాల్గొని సజ్జనరావు దంపతులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

పాతశివాలయంలో చండీహోమం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మార్గశిర అమావాస్యను పురస్కరించుకుని శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం(పాత శివాలయం)లో సోమవారం పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేకంగా చండీహోమాన్ని చేపట్టిన అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. శ్రీమల్లేశ్వర స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. శ్రీ అయ్యప్పస్వామి వారి సన్నిధిలో ఇరుముడి నిర్వహించిన అనంతరం దీక్షాపరులకు అన్నదానం చేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం పర్యవేక్షించారు.

విలువలతో కూడిన విద్యతోనే సార్థకత



ప్రసంగిస్తున్న షణ్ముఖశర్మ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విలువలతో కూడిన విద్య రాణిస్తుందని అప్పుడే దానికి సార్థకత లభిస్తుందని ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. కేబీఎన్ కళాశాల తెలుగు విభాగం, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో 'విద్య–విలువలు' అంశంపై ప్రసంగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షణ్ముఖశర్మ ప్రసంగిస్తూ అన్నిటికన్నా విలువైనది జీవితం అని పేర్కొన్నారు. క్షణికావేశాలతో జీవితాన్ని అంతం చేసుకోకూడదన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉత్తమప్రయోజనాలకు మాత్రమే వినియోగించాలన్నారు. కానీ ప్రస్తుత యువత మితిమీరి చేస్తున్న సాంకేతిక వినియోగం యువతరాన్ని తప్పుదోవ పట్టిస్తోందన్నారు. స్వామి వివేకానంద స్ఫూర్తిగా యువత శారీరక, మానసిక బలాన్ని పెంచుకుని, దేశం కోసం జీవితాన్ని అంకితం చేయాలని సూచించారు. తల్లిదండ్రుల పట్ల బాధ్యత నెరవేర్చడమే ప్రతి జీవితానికి సార్థకత చేకూరుస్తుందని వివరించారు. ఈసందర్భంగా కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఉసిరక ఉమామహేశ్వరరావు, టీ శ్రీనివాసు, హిందూహైస్కూల్స్ కమిటీ కోశాధికారి జీ బాబావిజయకుమార్ తదితరులు షణ్ముఖశర్మను సత్కరించారు. ఏవో డాక్టర్ వీ నారాయణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న వీఎంసీ ఏసీ చంద్రశేఖర్, ఇన్‌చార్జి సీఎంఓహెచ్ సురేష్ బాబు

పటమట(విజయవాడతూర్పు): నగరంలో ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్ ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు – పరిష్కార కార్యక్రమంలో ఆయన నగర వాసుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. విజయవాడ నగరపాలక సంస్థ 64 డివిజన్లలో నగర వాసులకు కల్పించే మౌలిక వసతుల్లో సమస్యలు ఉత్పన్నమైతే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. యుద్ధ ప్రాతిపదికన వాటిని పరిష్కరించి అర్జీదారులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో 10 ఫిర్యాదులు అందాయన్నారు. అందులో ఇంజినీరింగ్ విభాగం పై–4, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ విభాగాలపై రెండు చొప్పున, ప్రజారోగ్యం, ఎస్టేట్ విభాగంపై ఒక్క ఫిర్యాదు వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో వీఎంసీ చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, ఇన్‌చార్జి మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సత్యకుమారి, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, డీఎఫ్ఓ వెంకటేశ్వరరావు, ఎస్టేట్స్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బీఎస్ఎస్ సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో అనేక అనర్థాలు



మాట్లాడుతున్న సీడీపీఓ నాగమణి

వించిపేట(విజయవాడపశ్చిమ): బాలికలు ఆరోగ్యకరమైన, సాధికారిత దిశగా ముందుకు వెళ్లేందుకు ప్రతి ఒక్కరూ వారిని ప్రోత్సాహించాలని సీడీపీఓ నాగమణి సూచించారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా 49వ డివిజన్ సీఐటీయూ కార్యాలయంలో బాల్యవివాహాలు, బాలిక విద్యపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా నాగమణి మాట్లాడుతూ బాలికల్లో సామాజిక స్పృహ కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. చిన్నవయస్సులోనే బాలికలకు వివాహాలు చేస్తే వారిలో శారీరక, మానసిక సమస్యలు తలెత్తుతాయన్నారు. ముఖ్యంగా రక్తహీనత, శిశు మరణాలు, అనారోగ్య శిశువులకు జన్మనివ్వడం తదితర సమస్యలు ఉంటాయన్నారు. 18ఏళ్లలోపు బాలికలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, అందుకు ప్రోత్సాహించే తల్లిదండ్రులపై చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. సమాజంలో బాలికలకు ఉన్నత స్థానం కల్పించే దిశగా బాలికల విద్యకు ప్రతిఒక్కరు సహకరించాలని సూచించారు. చదువు మానేసిన బాలికలను తిరిగి పాఠశాలలో చేర్పించేందుకు అందరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ జ్యోత్స్న, , ఎంఈఓ డి.సోమేశ్వర్, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి మనోహర్‌కుమార్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జనవరి ఐదో తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవ 17వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆసంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్‌కుమార్ పిలుపునిచ్చారు. యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ ఎన్టీఆర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లాలో ప్రచార జాతాను నిర్వహించారు. నగరంలోని సంఘం రాష్ట్ర కార్యాలయం వద్ద మనోహర్‌కుమార్ పతాక ఆవిష్కరణ చేసి జాతాను ప్రారంభించారు.

యూటీఎఫ్ అభివృద్ధికి కృషి..

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తి చేసుకుందన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ పాటుపడుతోందని చెప్పారు. రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని జిల్లాలోని టీచర్స్‌ను కోరారు. జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సంఘం ఉపాధ్యాయ నియామకాల్లో అప్రెంటిస్ వ్యవస్థ రద్దుకు 16 ఏళ్ల నిర్విరామ పోరాటాలు చేసి సాధించిందని కొనియాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ సుందరయ్య మాట్లాడుతూ యూటీఎఫ్ అభివృద్ధికి అనేక మంది సంఘ పెద్దలు కృషి చేశారని వివరించారు. జాతా విజయవాడ నుంచి ప్రారంభమై ఇబ్రహీంపట్నం, మీదుగా మైలవరం, ఏకొండూరు, తిరువూరు, విస్సన్నపేట, రెడ్డిగూడెం మండలాల మీదుగా సాగింది. కార్యక్రమంలో పూర్వ రాష్ట్ర కోశాధికారి కె.సంజీవరెడ్డి, పూర్వ జిల్లా గౌరవాధ్యక్షుడు జి.పాల్‌బాబురావు, మచ్చా శ్రీనివాస్, బి.సత్యనారాయణరెడ్డి ఆయా ప్రాంతాల్లో పతాకాలను ఆవిష్కరించి ప్రసంగించారు.

డాక్టర్ అమృత సేవలు అభినందనీయం



డాక్టర్ అమృతను సత్కరిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉమ్మడి కృష్ణాతో పాటు, ఎన్టీఆర్ జిల్లాలో ఇమ్యునైజేషన్ అధికారిగా డాక్టర్ అమృత సమర్థవంతంగా విధులు నిర్వహించారని డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఆమె అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా డీఐఓగా పనిచేస్తున్న ఆమె పదోన్నతిపై గుంటూరు నగరపాలకసంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు సోమవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. డాక్టర్ అమృతను డీఎంహెచ్ఓతో పాటు పలువురు వైద్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ.. జిల్లాలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారన్నారు. నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌టీఓ డాక్టర్ జె.ఉషారాణి, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ మాధవీ నాయుడు, డీఎంఓ మోతీబాబు, వైద్యులు నవీన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పెయింటింగ్‌లతో టేబుల్ క్యాలెండర్



భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రముఖచిత్రకారుడు, గిరిజన గీతశిల్పి డాక్టర్ బొండా జగన్ మోహన్‌రావు చిత్రీకరించిన పెయింటింగ్‌లతో కోల్‌కతాకు చెందిన డ్రీమ్ పెయింట్ బ్రష్ సంస్థ రూపొందించిన 2025 నూతన సంవత్సర టేబుల్ క్యాలండర్‌ను స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని జగన్‌మోహన్‌రావు నివాసంలో సోమవారం ఆవిష్కరించారు. శ్రీకృష్ణదేవరాయ సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టేబుల్ క్యాలండర్‌ను 64 కళలు డాట్ కామ్ సంపాదకులు యల్లపు కళాసాగర్ ఆవిష్కరించారు. పాతశివాలయం మాజీ చైర్మన్ పదిలం రాజశేఖర్, రెడ్డిగూడెం మండలం మాజీ ఎంపీటీసీ రామినేని వెంకటేశ్వరరావు, దుర్గా కోఆపరేటివ్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ అల్లం పూర్ణ, బండి లక్ష్మి, కల్యాణి, మార్తాండ కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఓపెనింగ్...గుట్టుగా క్లోజింగ్

- మూతపడిన టూరిస్ట్ పోలీస్ క్యాబిన్
- ప్రమాదం జరిగితే పోలీసుసహాయం కోసం ఎదురుచూపులే

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ)కు చెందిన హరిత బరంపార్క్ (పున్నమి హోటల్)లో ఏర్పాటు చేసిన టూరిస్ట్ పోలీస్ అవుట్ పోస్ట్‌ను గుట్టుచప్పుడు కాకుండా మూసివేశారు. భవానీ ఐలాండ్‌కు వచ్చే పర్యాటకుల భద్రత కోసం సుమారు రెండున్నర ఏళ్ల క్రితం టూరిస్ట్ పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేశారు. కొన్నాళ్లు పోలీసులు హడావుడి చేశారు. ఆ తరువాత భవానీపురం పోలీసులకు ఒక్కచోటే ఉండటం బోరు కొట్టిందో..మరేదైనా కారణంచేతో ఈ అవుట్‌పోస్టును గుట్టుచప్పుడు కాకుండా ఎత్తివేశారు. ప్రస్తుతం టూరిస్ట్ పోలీస్ క్యాబిన్ నిరుపయోగంగా పడి ఉంది. యువతీ యువకులు, కాలేజీ విద్యార్థులు, ప్రేమికులు బెరంపార్క్‌కు వస్తుంటారు. కొందరు చెట్ల కింద ఉండే బెంచీలపై కూర్చుని గంటల తరబడి మాట్లాడుకోవడం, నలుగురూ చూస్తున్నారన్న ధ్యాస కూడా లేకుండా అతిచనువుగా వ్యవహరిస్తుంటారు. మరికొందరు భవానీ ఐలాండ్‌లోకి వెళ్లి సాయంకాలం వరకు కాలక్షేపం చేసి వస్తుంటారు. అదే విధంగా ఇతర ప్రాంతాల పర్యాటకులు కూడా భారీసంఖ్యలోనే వస్తుంటారు. దీంతో ఇక్కడ ప్రజలకు రక్షణ కల్పించడంతోపాటు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నియంత్రించేందుకు జిల్లా పోలీసు అధికారులు బెరంపార్క్‌లో టూరిస్ట్ పోలీస్ భవానీ ఐలాండ్ పేరుతో అవుట్ పోస్ట్ క్యాబిన్ ఏర్పాటు చేశారు. అదే విధంగా బెరంపార్క్, భవానీ ఐలాండ్‌లలో నేరాలు, ప్రమాదాలు జరిగినా వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడమే ఈ అవుట్ పోస్ట్ లక్ష్యం. భవానీపురం పోలీసులు ప్రతిరోజూ ఉదయం వచ్చి సాయంత్రం వరకు క్యాబిన్‌లో ఉంటూ వచ్చి పోయే పర్యాటకులు, సందర్శకులను గమనిస్తూ ఉంటారు. అనుమానం వచ్చినవారి వివరాలను తెలుసుకుని వారిపై నిఘా పెట్టేవారు. అలాగే వారి లగేజిని తనిఖీ చేస్తుంటారు. దీంతో రహస్యంగా కలుసుకునే లవర్స్ గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లయ్యింది. పోలీసులు చూస్తే తమ బండారం బయటపడిపోతుందని భయపడి ఇక్కడికి రావడం తగ్గించేశారు.

పర్యాటకులకు కొరవడిన భద్రత..

ఈ నేపథ్యంలో గతనెల రోజులకుపైగా టూరిస్ట్ పోలీస్ కేంద్రం మూతపడింది. భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత? లేక మరే కారణమో తెలియదుగానీ ప్రస్తుతానికి అవుట్‌పోస్టును మూసివేశారు. బెరంపార్క్‌లోగానీ భవానీ ద్వీపంలోగానీ ప్రమాదమో, నేరమో జరిగితే ఫిర్యాదు ఇచ్చేందుకు పోలోమంటూ సుమారు రెండు కిలో మీటర్లకుపైగా దూరంలో ఉన్న భవానీపురం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకతప్పదు. అంతేకాకుండా ఇక్కడ పోలీసు అవుట్ పోస్టు కారణంగా స్థానికంగా ఆకతాయిల ఆగడాలకు కూడా చెక్‌పడుతుంది. పర్యాటకులకు కూడా భద్రత ఉంటుంది. ప్రమాదాల సమయంలో బాధితులకు పోలీసుల సహాయం అందుతుంది. అంతటి ప్రాధాన్యం ఉన్న పోలీసు అవుట్‌పోస్టును ఎత్తివేయడంపై పర్యాటకులు పెదవివిరుస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పోలీసు అవుట్‌పోస్టును పునరుద్ధరించాలని పర్యాటకులు కోరుతున్నారు.

